మక్తల్ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తూ ముందుకు పోతా..

గత ప్రభుత్వాలు కొబ్బరికాయలు కొట్టి కొంగ జపాలు చేశారు

మక్తల్ అంటే మరుగున పడిన ప్రాంతం కాదు... అభివృద్ధిలో ముందున్న ప్రాంతం

నియోజకవర్గంలో రూ.2,200 కోట్ల అభివృద్ధి పనులు

పట్టణంలోని పూర్తయిన అభివృద్ధి పనులను ప్రారంభించిన మంత్రి వాకిటి శ్రీహరి





మక్తల్ నవంబర్ 7 వాయిస్ టుడే ప్రతినిధి: అభివృద్ధి పనులను అడ్డుకునే ప్రయత్నాలు ఎన్ని చేసినా వెనక్కి తగ్గేది లేదని, ఎన్ని అడ్డంకులు ఎదురైనా మక్తల్ నియోజకవర్గాన్ని అభివృద్ధిలో అగ్రగామిగా నిలుపుతానని రాష్ట్ర క్రీడా , పాడి పరిశ్రమాభివృద్ధి, పశుసంవర్ధక, మత్స్య యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి స్పష్టం చేశారు. మక్తల్ పట్టణంలోని 7వ వార్డులో గుర్లపల్లి వరకు 3 కోట్ల వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులను మంత్రి ప్రారంభించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..... వేగవంతంగా పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు.ప్రజాప్రతినిధిగా ప్రజలకు సేవ చేసే అవకాశం లభించిందని, ఆ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ నిరంతరం అభివృద్ధి పనులు చేస్తున్నానని తెలిపారు. తనను విమర్శించే వారికి ఒక్కటే సూచన చేస్తున్నానని, పని చేసే వారిని వెనక్కి నెట్టే ప్రయత్నం చేయవద్దని, వ్యక్తులను మానసికంగా వేధించవద్దని హితవు పలికారు. ఎన్ని అడ్డంకులు సృష్టించినా అంతకంటే వేగంగా ముందుకు సాగుతానన్నారు.మక్తల్ అభివృద్ధి విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు.

పట్టణ అభివృద్ధికి రూ.45 కోట్లు

మక్తల్ పట్టణ అభివృద్ధి కోసం ఇప్పటికే రూ.45 కోట్లు ఖర్చు చేశామని, నియోజకవర్గంలో సుమారు రూ.2,200 కోట్ల విలువైన అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని మంత్రి వెల్లడించారు. స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి ఇప్పటివరకు మక్తల్‌కు 200 కోట్ల అభివృద్ధి నిధులు కూడా రాని పరిస్థితి ఉండేదని, కానీ ప్రస్తుత మూడేళ్లలో ప్రజల ఆశీస్సులతో వేల కోట్ల రూపాయల అభివృద్ధి పనులు చేపట్టే అవకాశం లభించిందని పేర్కొన్నారు. నియోజకవర్గంలో రూ.550 కోట్లతో బీటీ రోడ్ల నిర్మాణ పనులు చేపడుతున్నామని తెలిపారు.

గత ప్రభుత్వాల హయాంలో అభివృద్ధి పేరుతో కొబ్బరికాయలు కొట్టి వెళ్లారే తప్ప క్షేత్రస్థాయిలో ప్రజలకు ఉపయోగపడే పనులు జరగలేదని విమర్శించారు. గతంలో రాష్ట్రంలో ఎక్కడో మరుగున పడిన మక్తల్ నేడు అభివృద్ధిలో అగ్రభాగాన నిలుస్తోందని అన్నారు. పట్టణంలోని ప్రతి వార్డులో అభివృద్ధి పనులు చేపట్టేందుకు కౌన్సిలర్లు పోటీపడుతున్నారని, ఇది ప్రజల్లో పెరిగిన అభివృద్ధి ఆకాంక్షకు నిదర్శనమని పేర్కొన్నారు.

అసత్య ఆరోపణలు మానుకోవాలి

నియోజకవర్గంలోని సహజ వనరులను అమ్ముకుంటున్నారంటూ ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదని మంత్రి ఖండించారు. పేదలు నిర్మించుకునే ఇళ్లు, ప్రభుత్వ అభివృద్ధి పనుల అవసరాల కోసమే ఇసుకను వినియోగిస్తున్నామని స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వ నిధుల్లోనూ సింహభాగం తెలంగాణ ప్రజలు చెల్లించే పన్నుల రూపంలోనే సమకూరుతోందనే విషయాన్ని ప్రతిపక్షాలు గుర్తించాలని సూచించారు.

మంత్రి అనే హోదాను పక్కనపెట్టి ప్రతి ఒక్కరితో కలిసిమెలిసి ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నానని తెలిపారు. మంచి ఎక్కడ జరిగినా గుర్తించాలని, అభివృద్ధిలోని లోపాలను నిర్మాణాత్మకంగా సూచించాలే తప్ప, చెడును వెతుకుతూ అసత్య ప్రచారాలు చేయడం సరికాదన్నారు. మన రాతలు మనమే మార్చుకోవాలని...ఖామోషీ బహుత్ ఖతర్నాక్ హై అంటూ ప్రజలు కూడా అభివృద్ధి కార్యక్రమాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు.

అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధం

మక్తల్ నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై మీడియా వేదికగా బహిరంగ చర్చకు తాను సిద్ధమని మంత్రి ప్రతిపక్షాలకు సవాల్ విసిరారు. మీరు లక్ష ప్రశ్నలు వేసినా ప్రతి ప్రశ్నకు ఆధారాలతో సమాధానం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నానని ప్రకటించారు. అభివృద్ధి గురించి తెలిసిన ప్రతి ఒక్కరూ ప్రతిపక్షాల విమర్శలకు వాస్తవాలతో సమాధానం చెప్పాలని పిలుపునిచ్చారు. మక్తల్ పట్టణంలోని ప్రతి వార్డుకు మెరుగైన రహదారులు, డ్రైనేజీ సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని, గ్రామీణ ప్రాంతాల్లోనూ రహదారుల నిర్మాణానికి పెద్దపీట వేస్తున్నామని తెలిపారు. విమర్శలకు సమాధానం అభివృద్ధి పనులే.. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడమే తన లక్ష్యమని, మక్తల్‌ను అన్ని రంగాల్లో ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దే వరకు విశ్రమించబోనని మంత్రి వాకిటి శ్రీహరి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మక్తల్ మున్సిపల్ చైర్మన్ వాకిటి మానస హన్మంతు, 7వ వార్డు కౌన్సిలర్ కలాల్ శ్రీవిద్య, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

దీపావళి వేడుకలు ప్రశాంతంగా జరుపుకోవాలి

ఝరాసంగం ఎస్సై క్రాంతి కుమార్ పాటిల్

పేకాట, జూదం నిర్వహిస్తే కఠిన చర్యలు

టపాసులు కాల్చేటప్పుడు తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలి

పిల్లలపై పెద్దలు ప్రత్యేక శ్రద్ధ వహించాలి



జహీరాబాద్ వాయిస్ టుడే , నవంబర్ 07: ఝరాసంగం మండల ప్రజలందరికీ ఝరాసంగం ఎస్సై క్రాంతి కుమార్ పాటిల్ దీపావళి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి ఒక్కరూ కుటుంబ సభ్యులతో కలిసి పండుగను ఆనందోత్సాహాలతో, ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని సూచించారు. దీపావళిని పురస్కరించుకుని గ్రామాల్లో పేకాట, జూదం వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా, పేకాట శిబిరాలు నిర్వహించినా చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్సై క్రాంతి కుమార్ పాటిల్ హెచ్చరించారు. పండుగ పేరుతో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలను ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. అదేవిధంగా టపాసులు, బాణాసంచా కాల్చే సమయంలో ప్రతి ఒక్కరూ తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. చిన్నారులు టపాసులు కాల్చేటప్పుడు తల్లిదండ్రులు, పెద్దలు తప్పనిసరిగా పర్యవేక్షించాలని తెలిపారు. జనసంచారం ఎక్కువగా ఉన్న ప్రాంతాలు, ఇళ్ల సమీపంలో బాణాసంచా కాల్చకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ప్రజలందరూ పోలీసులకు సహకరిస్తూ ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా సురక్షితంగా, సంతోషంగా దీపావళి పండుగను జరుపుకోవాలని ఎస్సై క్రాంతి కుమార్ పాటిల్ ఆకాంక్షించారు.

మధుమేహ వ్యాధి అవగాహనా కరపత్రం ఆవిష్కరణ



రాయికల్(వాయిస్ టుడే): రాయికల్ పట్టణంలోని స్థానిక శివాజీ విగ్రహం వద్ద లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మధుమేహ వ్యాధి పై అవగాహనా కరపత్రం ఆవిష్కరించారు ఇట్టి సందర్భంగా లయన్స్ క్లబ్ అధ్యక్షులు వాసం ప్రసాద్ మాట్లాడుతు మధుమేహ వ్యాధిని – చెక్కర వ్యాధి, షుగర్ వ్యాధి అని సాధారణంగా అంటూ వుంటారు. చాలా మందికి ఈ వ్యాధి ఉందని గ్రహించలేరు మరియు అది వారి ఆరోగ్యానికి కలిగించే తీవ్రమైన పరిణామాలను వారు అర్థం చేసుకోలేరు. టైప్ (2) మధుమేహ వ్యాధి అత్యధిక కేసులకు కారణమవుతుంది. ప్రపంచవ్యాప్తంగా 250 మిలియన్లకు పైగా ప్రజలు మధుమేహంతో బాధపడుతున్నారు. 2025 నాటికి మధుమేహం 380 మిలియన్లను ప్రభావితం చేస్తుందని అంతర్జాతీయ డయబెటీస్ సంస్థ అంచనా. ప్రతి సంవత్సరం 1 మిలియన్ మంది డయబెటిస్తో చనిపోతున్నారు. ఇండియన్ కౌన్సిల్ మెడికల్ రీసెర్చ్ లెక్కల ప్రకారం 10 కోట్ల మంది డయబెటిస్ సమస్య తో బాధ పడుతున్నారని .

డయబెటీస్ కారణాలు: శరీరంలో ఉత్పత్తి అయ్యే ఇన్సులిన్ హర్మోన్ శరీరములోని షుగర్ సమతుల్యము చేసి, అవసరానికి షుగర్ అందుబాటులో వుండునట్లు చేయుటలో ఇన్సులిన్ ప్రధాన పాత్ర వహిస్తుంది.శరీరంలో ఇన్సులిన్ శాతం తగ్గినచో మధుమేహం వస్తుంది.ఉత్పత్తి అయిన ఇన్సులిన్ శరీరంలోని కణాలు సరిగా వినియోగించుకోకపోవడం వలన మధుమేహం వ్యాధి వస్తుంది.

మధుమేహం (3) రకాలు

టైప్ 1 డయాబెటిస్: పాంక్రియాస్ (క్లోమగ్రంధి) నుండి ఇన్సులిన్ ఉత్పత్తి ఆగిపోతుంది. ఫలితంగా రక్తంలో గ్లూకోజ్ నిల్వలు పెరుగుతాయి. ఇది చిన్న పిల్లల్లోను బాల్యంలోనే బయటపడుతుంది.అని టైప్ 2 డయాబెటిస్: క్లోమగ్రంథి తగినంత ఇన్సులిన్ ఉత్పత్తి చేయదు. లేదా ఉత్పత్తి అయిన ఇన్సులిన్ సమర్థంగా పనిచేయదు.టైప్ 3 డయాబెటిస్ : కొందరు మహిళలు గర్భంతో ఉన్నప్పుడు (జెస్టినేషనల్ డయాబెటిస్) షుగర్ వ్యాధి వస్తుంది.అధిక బరువు ఉన్న వాళ్ళు చిన్న వారైన, పెద్దవారికైన రావచ్చు.మానసిక వత్తిడికి లోనైనవారికిశారీరక శ్రమ లేనివారికికొన్ని సందర్భాలలో వారసత్వంగా కూడా ఈ వ్యాధి రావచ్చును.అవసరమైన మోతాదులకన్నా ఎక్కువగా ఆహారము తినేవాళ్ళకుతరచుగా జబ్బులతో బాధపడువారు రోగ నిరోధక శక్తిని కోల్పోయి మధుమేహ వ్యాధి రావచ్చును.కొన్ని రకాల మందులు దీర్ఘకాలం వాడడం వలన ఈ వ్యాధి రావచ్చును.

మధుమేహ వ్యాధి లక్షణాలు

ఆకలి ఎక్కువగా ఉండి చాలా మార్లు ఎక్కువగా ఆహారం తీసుకోవడం.సాధరణ కన్నా ఎక్కువగా దప్పిక కావడం ఎక్కువగా నీరు త్రాగడం.ఎక్కువసార్లు మూత్ర విసర్జనకు వెళ్ళడం.కొంతమందిలో బరువు తగ్గడం, గాయం తగిలినచో సరిగా మానకపోవడం– త్వరగా తగ్గకపోవడం.నీరసంగా, నిస్త్రాణంగా ఉండడం, స్త్రీలలో అసాధారణంగా తెల్లబట్ట కావడం, తరుచుగా చర్మవ్యాధులు రావడం కొందరిలో కాళ్ళు – చేతులు ముఖ్యంగా పాదాలు అరచేతులు తిమ్మిరిగా వుండడం.

ఏదైనా పని చేయాలన్నా చికాకు, అనహనము కలిగి త్వరగా అలసిపోవడం వంటి లక్షణాలలో ఏ లక్షణాలైనా వుండవచ్చును.మధుమేహం వలన ఎక్కువ శాతం అన్ని అవయవాలకు అనారోగ్యం కలిగే అవకాశం ఉంది.ముఖ్యమైన అవయవాలు :మూత్ర పిండాలు, గుండె, రక్త నాళాలు, కళ్ళు (కంటిలో రక్త నాళాలు), నరాలు, కాళ్ళు పాదాలు నరాలకు మధుమేహ ప్రభావం కారణంగా గాయం అయినా, పుండు అయినా మానకపోవడం లేదా నిధానంగా మానడం జరుగుతుంది.

తీసుకోవలసిన జాగ్రత్తలు: వీలైనంత త్వరగా లక్షణాలను గుర్తించి, ఏ రకమైన మధుమేహమో, నిర్ధారించుకోవలసిన అవసరం ఉంది. డాక్టరును సంప్రదించి వ్యాధినిర్ధారణ, వైద్యం చేయించుకోవడం ప్రధానము.శరీర కష్టం చేయనివారు, క్రమంతప్పక వ్యాయామం (అంటే నడక) చేయాలి. ప్రతి రోజు సుమారు 30 నిమిషాలు స్పీడ్గా నడవాలి (బ్రిక్స్ వాక్) కనీసం వారంలో 5 రోజులు నడక, వ్యాయామం చేయాలి.

బరువులు ఎత్తడం లాంటి ప్రమాదకర వ్యాయమం చేయరాదు. పంచదార, తీపి పదార్థాలు, బెల్లం, జీడిపప్పు, బాదం, కొబ్బరి నీళ్ళు, హార్లిక్స్ లాంటి పొడి పదార్థాలు అరటి, మామిడి, సపోటా, సీతాఫలం, ద్రాక్ష వంటి పండ్లు బిస్కట్లు, చాక్లెట్లు, కేకులు మొదలగునవి బంగాళాదుంప, నెయ్యి, ఇతర నూనె పదార్థాలు.

డయబెటీస్ పై యుద్ధం :లయన్స్ ఇంటర్నేషనల్ సూచించిన ప్రకారం ప్రపంచాన్ని అత్యధికంగా ప్రభావితం చేస్తున్న మధుమేహం గ్లోబల్ కాజెస్లో ఒకటి. లయన్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 320–+ డయబెటీస్ పై యుద్ధం ప్రకటించి ప్రజల్లో చైతన్యం తేవడానికి డయాబెటిస్ పరీక్షలు నిర్వహిస్తుంది. మీరు కూడా మీ దగ్గర జరిగే లయన్స్ క్లబ్ నిర్వహించే డయబెటీస్ క్యాంప్ ఉచిత డయబెటిస్ నిర్ధారణ పరీక్ష చేసుకొండి, తగిన జాగ్రత్తలు తీసుకోండి. మీ ఆరోగ్యాన్ని కాపాడుకోండి అని అన్నారు. ఈ కార్యక్రమంలో జెడీసీ మ్యాకల రమేష్ సెక్రటరీ కనపర్తి శ్రీనివాస్ ,సమల్లరిసత్యనారాయణ సంకోజీ అశోక్ ,దాసరి గంగాధర్ మచ్చ శేఖర్ తదిరులు పాల్గొన్నారు.



జ్ఞాపకశక్తి పెంపుపై అవగాహన కార్యక్రమం

రాయికల్(వాయిస్ టుడే): విద్యార్థుల్లో జ్ఞాపకశక్తి, ఏకాగ్రత, ఆలోచనా సామర్థ్యం మరియు అభ్యసన నైపుణ్యాలను పెంపొందించేందుకు విస్డం హైస్కూల్ ఆధ్వర్యంలో జ్ఞాపకశక్తిపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రచయిత సైకాలజిస్ట్ మెమోరీ సీనియర్ కోచ్ డాక్టర్ వేణు కుమార్ విద్యార్థులకు జ్ఞాపకశక్తి ప్రాముఖ్యత, చదివిన విషయాలను ఎక్కువ కాలం గుర్తుంచుకునే పద్ధతులు, ఏకాగ్రతను పెంచుకునే మార్గాలు, సమయపాలన, క్రమబద్ధమైన అధ్యయనం వంటి అంశాలపై అవగాహన కల్పించారు.విద్యార్థులు కేవలం పాఠ్యపుస్తకాలకే పరిమితం కాకుండా, సృజనాత్మకంగా ఆలోచిస్తూ, తమలోని ప్రతిభను వెలికితీసుకోవాలని సూచించారు., వివిధ రకాల ఆక్టివిటీ లు , మెదడుకు పదును పెట్టే చిన్న చిన్న అభ్యాసాలు, ప్రశ్నోత్తరాల ద్వారా విద్యార్థుల్లో ఆసక్తిని పెంచారు. అనంతరం తాను రాసిన మెమోరీగైడ్, 24 గంటల్లో ఇంగ్లీష్ పుస్తకాలను పాఠశాలకు బహుకరించారు. ఈ సందర్భంగా పాఠశాల కరెస్పాండెంట్ ఎ.ఎమ్ రాజురెడ్డి మాట్లాడుతూ, విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధే తమ పాఠశాల ప్రధాన లక్ష్యమని, విద్యతో పాటు మానసిక వికాసం, ఆత్మవిశ్వాసం, సృజనాత్మకతకు కూడా సమాన ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ నివేదిత రెడ్డి, విశ్రాంత ఉపాధ్యాయులు ఆరేటి వెంకటేశ్వర్లు ఉపాధ్యాయులు మరియు విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.



వందేమాతరం గేయాలాపనతో 150 ఏళ్ల వందేమాతరం వేడుకల ముగింపు వారంలో సామూహిక గానం

రాయికల్(వాయిస్ టుడే)బీ రాయికల్ పట్టణంలో వందేమాతరం గేయం 150 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహిస్తున్న వేడుకల ముగింపు వారంలో భాగంగా శనివారం రాయికల్‌లోని ప్రగతి హైస్కూల్ ఐఐటీ అకాడమీలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి బంకించంద్ర చటోపాధ్యాయ రచించిన వందేమాతరం గేయాన్ని సామూహికంగా ఆలపించారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ బాలె శేఖర్ మాట్లాడుతూ.. వందేమాతరం గేయం భారతీయుల్లో దేశభక్తి, జాతీయ సమైక్యతా భావాన్ని పెంపొందించిందన్నారు. స్వాతంత్ర్య పోరాట కాలంలో ఈ గేయం ప్రజల్లో స్ఫూర్తిని నింపిందని పేర్కొన్నారు. విద్యార్థులు దేశ చరిత్ర, స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను తెలుసుకోవడంతో పాటు దేశం పట్ల గౌరవం, బాధ్యత కలిగి ఉండాలని సూచించారు.కార్యక్రమంలో అకాడమిక్ డైరెక్టర్ నిఖిల్ కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.



ఉచిత షుగర్, బీపీ పరీక్షలు

రాయికల్(వాయిస్ టుడే): లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో రాయికల్ పట్టణంలోని భీమన్న దేవస్థానం వద్ద శుక్రవారం ఉచిత మధుమేహం (షుగర్), రక్తపోటు (బీపీ) వైద్య పరీక్షల శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పి జెడ్ సి మ్యకల రమేష్ ,లయన్స్ క్లబ్ అధ్యక్షులు వాసం ప్రసాద్,మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా లయన్స్ క్లబ్ అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోందని, ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా షుగర్, బీపీ పరీక్షలు చేయించుకొని ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని సూచించారు బిపి షుగర్ గుండె పోటు ,బ్రెయిన్ ట్రూమార్ లాంటి ఆరోగ్య విఘాతానికి కారణం అవుతాయని ప్రతి ఒక్కరు జాగ్రత్తగా ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కొయ్యడి మహిపాల్ , సామల సత్యనారాయణ, కౌన్సిలర్ పుర్రె శ్రీధర్ ల్యాబ్ టెక్నీషియన్ మోసారపు సంతోష్, తదితరులు పాల్గొన్నారు



పేదల సొంతింటి కల నెరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యం

ఇందిరమ్మ లబ్ధిదారుల ఇంట్లో మంత్రి పొన్నం ప్రభాకర్ దీపావళి సంబరాలు

కరీంనగర్ (టైమ్‌టుడే): పేదల సొంతింటి కలను నెరవేర్చడమే ప్రజాపాలన ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. కరీంనగర్ పట్టణంలోని కట్టా రాంపూర్‌లో ఇందిరమ్మ ఇల్లు పొందిన గుండా సంధ్యారాణి కుటుంబంతో కలిసి 'మన ఇందిరమ్మ ఇంట్లో దీపావళి' వేడుకల్లో పాల్గొన్నారు. దశాబ్దకాలంగా సొంతింటి కోసం ఎదురుచూసిన సంధ్యారాణికి ఇల్లు మంజూరు కావడంతో కొత్త ఇంట్లో తొలి దీపావళి జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. లబ్ధిదారుల కుటుంబాలకు నూతన వస్త్రాలు అందించి, వారితో కలిసి బాణాసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు.

రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు సుమారు 2.30 లక్షల ఇందిరమ్మ ఇళ్లకు గృహప్రవేశాలు పూర్తయ్యాయని మంత్రి తెలిపారు. గతంలో ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇళ్లు కేటాయించగా, రెండో విడతలో మరో 2,000 ఇళ్లు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు అందిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, మున్నూరు కాపు కార్పొరేషన్ చైర్మన్ బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి, కార్పొరేటర్లు, అధికారులు పాల్గొన్నారు.